# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## కాణిపాకం దేవస్థానంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

కాణిపాకం, జూలై 19 ప్రభాతవార్త:



శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స వ్ఛ్చ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొదటగా ఆలయ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆలయ ఆలయ అధికారులు, సిబ్బంది దేవస్థానం అతిథి గృహం నుండి ర్యాలీ నిర్వహించి బస్టాండు, కాణిపాకం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా షాపులు, హోటళ్ళులో ప్లాస్టిక్ కవర్లు వాడరాదని, డీగ్రేడబుల్ కవర్లును వాడాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ధనుంజయ, ఎస్వీ,కృష్ణారెడ్డి, ప్రసాద్, ధనపాల్, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.150కోట్లతో తిరుపతి మోడరన్ సిటీగా అభివృద్ధి

### -సిఎం చంద్రబాబు

తిరుమల, జూలై 19ప్రబాతవార్తప్రతినిధి:



తిరుపతిని దేశానికి మోడరన్ సిటీగా అభివృద్ధిచేస్తానని, ఇదీ నా బాధ్యత అని సిఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. 100 కోట్లనుండి 150కోట్లరూపాయలు తిరుపతి అభివృద్ధికి ఖర్చుచేస్తామన్నారు. పారిశ్రామిక హబ్‌గా, విద్యా కేంద్రంగా, ఆధ్యాత్మికనగరంగా మారుస్తామన్నారు. డెస్టినేషన్ మ్యారేజీలన్నీ తిరుపతిలో జరిగేలా చూస్తా...నా బాధ్యత అన్నారు. పలు పథకాల ద్వారా తిరుపతిని అభివృద్ధిచేస్తానన్నారు. సిఎం చంద్రబాబును టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

### -రోడ్లపై చెత్తపడేయొద్దు -విరివిగా చెట్లు నాటుదాం -తిరుపతి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రసభలో సిఎం చంద్రబాబు





తిరుపతి, జూలై 19ప్రభాతవార్త:

పర్యావరణానికి అతిపెద్ద భూతంగా తయారైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఈ భూతానికి ఎవరూ బలికాకూడదని అన్నారు. ఉదయం పళ్ళు తోముకునే బ్రష్ నుండి ఆహారం తినే ప్లేట్ల వరకు అన్నింటా ప్లాస్టిక్ వాడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేసారి వాడి పడేసే ప్లాస్టిక్‌తో నీటిని, నేలను కలుషితం చేస్తున్నాయన్నారు. క్యాన్సర్ రావడానికి ప్లాస్టిక్ కారణంగా మారిందన్నారు. "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" లో భాగంగా మూడవశనివారం మధ్యాహ్నం తిరుపతిలోని పోలీసు మైదానంలో జరిగిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువై వర్షం నీరు భూమిలోకి ఇంకడంలేదన్నారు. మొక్కలు మొలకెత్తవని, నీటిమూలాలు మూసుకుపోతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంలో యువత ఉత్సాహం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఈ దేశానికి సంపద ప్రపంచంలో ఎక్కడ చూసినా 30శాతంమంది మనవారేనన్నారు. ఇక్కడ పిల్లల్ని చూస్తుంటే నా కాలేజీ రోజులు గుర్తుకువస్తున్నాయని, నేను కూడా తిరుపతిలోనే చదువుకున్నానన్నారు. తరువాత ఎమ్మెల్యే అయ్యానని సంతోషంగా తెలిపారు. అంచెలంచెలుగా ఎదిగి నాల్గవసారి ముఖ్యమంత్రి కావడానికి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కారణమన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యంకావాలని ఆయన పిలుపునిచ్చారు. మన ఇల్లు పరిసరాలు శుభ్రం చేసుకోవాలని, పల్లెలు, పట్టణాలు,చెరువులు ప్రభుత్వ కార్యాలయాలు,ఆస్పత్రులు, పరిశ్రమలు విద్యాలయాల్లో ప్రతి మూడవశనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని మనం కాపాడుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. చెట్లు విరివిగా నాటాలని సిఎం సూచించారు. అక్టోబర్ 2వతేదీకి పేరుకుపోయిన చెత్తను తొలగిద్దామని ఆయన అన్నారు. చిన్నపుడు కరెంట్ లేక లాంథర్ వెలుతురులోనే చదువుకున్నానని సిఎం చంద్రబాబు బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. నేటు ఇంటిపైనే సోలార్‌కరెంట్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. 20లక్షల ఇళ్ళపై సోలార్ విద్యుత్‌కు అనుమతించామన్నారు. ఇల్లూ, కార్యాలయాలు, పొలాలు కరెంట్ ఉత్పత్తి చేసే కేంద్రాలుగాతయారవుతున్నాయని అనుభూతి వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరెంట్ బొగ్గుతో తయారయ్యేదని, నేడు గాలితో కరెంట్ ఉత్పత్తి వచ్చిందని, గ్రీన్‌ఎనర్జీపై శ్రద్ధపెట్టానని సిఎం అన్నారు. గ్లోబల్‌వార్మింగ్ వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని, దీనికి పరిష్కారం గ్రీన్ ఎనర్జీనేనని అన్నారు. అనంతరం బంగారుకుటుంబాలు ఎంపికైన కుటుంబసభ్యులతో చంద్రబాబు ప్రత్యేకంగా ముచ్చటించారు. వారి కుటుంబం ఆర్థికంగా ముందుకు రావడానికి కృషిని వివరించారు. మున్సిపాల్టీల్లో ఒకేసారి వాడే ప్లాస్టిక్ వస్తువులను నిషేధిద్దామన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని దశలవారీగా అమలుచేయడానికి ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని చంద్రబాబు కోరారు. తడిచెత్త నుండి కంపోస్టు తయారుచేసుకుని ఇంటిలోనూ వాడుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి నారాయణ, ఎంఎల్‌ఎ శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి, తుడ ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి, రాష్ట్రస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి,పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.సుగుణమ్మ, సిఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ మౌర్య, జిల్లా సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్ ,స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### స్వచ్ఛాంధ్ర సర్వేక్షణ్ అవార్డు

## పారిశుధ్యకార్మికుల సహకారం

### మహాయజ్ఞంలో స్వచ్ఛాంధ్ర చేద్దాం

### తిరుపతి సభలో సిఎం చంద్రబాబు



తిరుపతి కార్పొరేషన్, జూలై 19ప్రభాతవార్త:

తిరుపతి ఆధ్యాత్మికకేంద్రం, పుణ్యక్షేత్రం పరిశుభ్రంగా ఉంచాలని, ఎవరూ కూడా ఇళ్ళల్లో ఊడ్చే చెత్త రోడ్లపై పడేయొద్దని, మన ఇల్లు, మన పరిసరాలు మనమే పరిశుభ్రంగా ఉంచుకొందామని సిఎం చంద్రబాబునాయుడు సూచించారు. ఇప్పటికే తడి,పొడి చెత్తగా ఇంటింటినుండి నగరపాలకసంస్థలు, మున్సిపాల్టీలో చెత్తసేకరణ చేస్తున్నాయని, ఇందుకోసం ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చామన్నారు. చెత్తనుండి సంపద సృష్టించుకోవాలన్నారు. "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" లో భాగంగా శనివారం ఉదయం తిరుపతికి సమీపంలోని రేణిగుంట తూకివాకంలో 300 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ కోసం ఓ పారిశ్రామిక పార్కును తయారుచేశామని సిఎం చంద్రబాబు తెలిపారు. అక్కడ వినియోగించిన నీటిని సాగునీటి కోసం పంపిణీ చేస్తున్నామన్నారు. వివిధ తడి వ్యర్థపదార్థాల ద్వారా బయోగ్యాస్, కంపోస్టు, పొడిచెత్తతో ప్లాస్టిక్ గ్రాన్యుల్‌స తయారుచేసేందుకు అవకాశం ఉందని సిఎం తెలిపారు. తిరుపతిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్ది దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని బాబు పిలుపునిచ్చారు. తిరుపతి,గుంటూరు, రాజమండ్రి, విశాఖకు,విజయవాడ నగరాలకు అవార్డులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా మన నగరాల స్వచ్ఛతకోసం పనిచేసిన పారిశుధ్యకార్మికులు, అధికారులను సహకరించిన ప్రజలను అభినందిస్తున్నానని సిఎం వెల్లడించారు.

## వైభవంగా కోదండరాముని తెప్పోత్సవం

### -పోటెత్తిన భక్తజనం

తవణంపల్లె, జూలై 19 ప్రభాతవార్త:

మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు ఆలయ పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో ఈనెల 7 నుండి జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవలలో ఊరేగుతూ అలసి సొలసిన స్వామి, అమ్మవార్లు చివరిరోజు తెప్పలపై విహరిస్తూ సేదదీరారు. ఈమేరకు శనివారం స్వామివారికి తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి టి.పుత్తూరు చెందిన కెఎం.యాగమూర్తి అండ్ సన్స్, రాయపాటి గణపతినాయుడు, బెంగుళూరుకు చెందిన ఉదయ్‌కుమార్‌రెడ్డి,తవణంపల్లె రెడ్డెప్పరెడ్డి అండ్ సన్స్, పి.లోకనాథరెడ్డి అండ్ సన్స్, మునిరత్నంరెడ్డి అండ్ సన్స్,ఎం.జయచంద్రారెడ్డి అండ్ సన్స్, ఐ.వేణుగోపాల్‌రెడ్డి అండ్ సన్స్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి శ్రీసీతా లక్ష్మణ సమేతంగా సర్వాలంకృతుడై వేదపండితుల మం త్రోచ్ఛారణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పరిమళ పుష్పాలతో స్వామివారి పుష్కరిణిలో భారీ ఎత్తున ఏర్పాటు చేసి దేదీప్యమానంగా అలంకరించిన తెప్పలపై వుంచి మూడు సార్లు ప్రదక్షిణ చేయించారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.ఈకార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వరరెడ్డి. ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. దేవస్థానంలో ఆదివారం జరిగిన తెప్పోత్సవంతో 15 రోజుల పాటు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.

## పసిడి శేష వాహనంపై కుమారస్వామి చిద్విలాసం



శ్రీకాళహస్తి,జూలై 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పసిడి శేష వాహనంపై వల్లి దేవసేన సమేత కుమారస్వామి భక్తులకు దర శ్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో ఆడికృత్తికకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇక్కడి భక్తులే కాకుండా తమిళనాడు నుంచి వచ్చిన భక్తులు కూడా కుమారస్వామి కొండకువెళ్ళి దర్శనం చేసుకుంటారు. భరణి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లనుచక్కగా అలంకార మండపంలో రాజేష్ గురుకుల్ ముస్తాబు చేశారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి పూజలు నిర్వహించి ఉత్సవానికి పట్టణంలో పంపారు. తేరువీధిలోని వాహనాల మండపం వద్ద బంగారు శేష వాహనంపై వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని ప్రతిష్టించారు. ఆలయాధికారుల, ఉభయదారులు టిఎం కృష్ణప్పదేవర్ కుటుంబసభ్యులు, పిండి హేమాద్రి కుటుంబ సభ్యులు, మందల మునికృష్ణయ్య తరఫున వారి ప్రతినిధులు వెంటరాగా ఉత్సవం అంగరంగ వైభవంగా తేరువీధి, నెహ్రూవీధి, సినిమావీధి, నారదపుష్కరిణి, నగరి వీధి, బజారువీధుల మీదుగా సాగింది. టెంపుల్‌ఇన్స్పెక్టర్లు సుదర్శనం, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, సూపరింటెండెంట్ రవి టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, సుదర్శనం ఆలయ సిబ్బంది వెంటరాగా ఉత్సవం సాగింది.

## యాళీవాహనంపై కుమారస్వామి దివ్యదర్శనం



శ్రీకాళహస్తి,జూలై 19 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి అనే సుబ్రమణ్యం స్వామి ఆలయంలో శనివారం నుంచి ప్రధాన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం భరణితో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చెంగల్వరాయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, కుమారస్వామి కొండపై మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం అలంకార మండపంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా అలంకరించారు..అక్కడ బంగారు యాళీవాహనంపై వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామిని ప్రతిష్టించారు.గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఎఇఓ హేమామాలిని, సూపరింటెండెంట్ రవి,చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,ఎస్ఎంకె పరశురాంగురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

## స్పాట్...ఎందుకో లేట్..!

తిరుపతి విద్య జూలై 19 ప్రభాత వార్త:





టీటీడీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మూడు రకాల కౌన్సిలింగ్ ప్రవేశాల ప్రక్రియ ముగిసి దాదాపు 25 రోజుల పూర్తి కావస్తున్నా మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. ఈనెల 14న స్పాట్ అడ్మిషన్లు చేపట్టాల్సి ఉండగా టీటీడీ అధికారుల నిర్లక్ష్య దోరణితో అది కాస్త వాయిదా పడింది. వాయిదా వేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు,అటు కళాశాల సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.రాయలసీమ జిల్లాల నుంచి పలువురు తల్లిదండ్రులు ప్రతి రోజు వ్యయ ప్రయాసలకోర్చి కళాశాలల చుట్టూ తిరుగుతున్నారు.వాయిదా వ్యవహారంలో స్థానిక ప్రజాప్రతినిధులు,రాజకీయ పార్టీల ముఖ్యనేతల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది.ప్రధానంగా టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాల,ఎస్వీ బదిర కళాశాలల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కాస్త డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. రాష్ట్ర స్థాయి మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో అధికారులకు కాస్త తలనొప్పిగా మారినట్లు సమాచారం.



స్వచ్ఛత ప్లాస్టిక్ నిర్మూలనపై అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

## ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి

### - కలెక్టర్ పిలుపు

చిత్తూరు, జులై 19 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆవరణలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛత ప్లాస్టిక్ నిర్మూలన'పై నిర్వహించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను అంతం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగంను ఆపి, జూట్ బ్యాగులను విరివిగా వినియోగించాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరు షాపింగ్‌కు వెళ్ళినపుడు ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలన్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు మొదలు పెద్ద పెద్ద షాపులు, సూపర్ మార్కెట్లు మొదలైన వ్యాపారులు ప్లాస్టిక కు బదులుగా జ్యూట్ బ్యాగులను వినియోగదారులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆడికృత్తికకు ఏర్పాట్లు ఘనం

### ఉత్సవాలకు తగ్గుతున్న భక్తులు - నేడు ఆడికృత్తిక



ముస్తాబైన కుమారస్వామి ఆలయం

శ్రీకాళహస్తి, జూలై 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆడికృత్తిక సందర్భంగా ప్రధాన ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని చక్కగా విద్యుద్దీపాలంకారాలతో ముస్తాబు చేశారు. కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు మూడు రోజులుగా ఆలయాన్ని ముస్తాబు చేశారు.పరిసరాల్ని పండగ వాతావరణంలా తీర్చి దిద్దారు. కోనేరులో నీటి కొరతతో నింపారు. కోనేరులోని చెత్తా చెదారాల్ని తీసి శుభ్రం చేశారు. సాధారణంగా కొందరు భక్తులు భరణి సందర్భంగా స్వామిని దర్శించుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శనివారం భరణి రావటంతో ఆలయం వద్ద దుకాణాలు ఫుల్ వ్యాపారం నిల్ అన్నట్లు మారింది. పట్టణంలోని వ్యాపార సంస్థల వద్ద జనం పలచగా కనబడ్డారు. సమీప గ్రామాల నుంచి కొందరు భక్తులు కావళ్ళతో 'హరోం హర'అంటూ కదలి రావటం ఆనవాయితి. కానీ ఈ ఏడాది ఆడికృత్తిక సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం కనబడటం లేదు. కారణం గ్రామాల్లో పండగలపై ఉత్సాహం చూపటం లేదు. పట్టణానికి చెందిన కొందరు భక్తులు మాత్రం కావళ్ళతో కదలి వచ్చి కుమారస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. కారణం పెరిగిన ధరలుతో ఏం పండగలుచేసుకుందాములే అనే నిరాసక్తత చోటు చేసుకుంది. దాంతో ఆలయం వెల వెల బోయింది.ఆడికృత్తిక ఉత్సవాలకు వారం ముందు నుంచి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వారి సిబ్బందిని పరుగులు తీయించి ఏర్పాట్లు సమీక్షించారు. పలుమార్లు ఇఓ యే స్వయంగా ఇక్కడ ఏర్పాట్లు సమీక్షించారు.

### దుకాణాల వద్ద కానరాని రద్దీ:

శ్రీకాళహస్తిలో శనివారం మధ్యాహ ్నం నుంచి కొందరుభక్తులు కావళ్ళ తో పసుపు బట్టలు ధరించి కుమారస్వామిని స్తుతిస్తూ కదలి వచ్చా రు. ఇక సాధారణంగా ఆడికృత్తిక సందర్భంగా కృత్తిక రోజూ ఆల యంలో మొక్కులు తీర్చుకుంటారు. ఆడికృత్తిక సందర్భంగా గ్రామాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకునే వారు కావళ్ళను అందుకు అవసరమైన వస్తువుల కొనుగోళ్ళలో రద్దీ కనబడేది. అయితే ఈ ఏడాది దుకాణాలు వెల వెల బోతు కనబడ్డాయి.గతంలో ఉన్నంత ఉత్సాహం పండగల సందర్భంగా కనబడలేదు. కారణం సకాలంలో వర్షాలు కురవకపోవటంతో ప్రజల్లో ఉత్సాహం సన్నగిల్లింది. ఆడికృత్తిక సందర్భంగా శ్రీకాళహస్తిలో వెలసిన కుమారస్వామిని సుమారు 50వేల మందికి పైగా దరి ్శంచుకుంటారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఇఓ డి.బాపిరెడ్డి ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి వారి సిబ్బంది సమీక్షించారు. శనివారం రద్దీ కనబడక పోవటంతో ఒకే సారి ఆదివారం తరలి వస్తారని ఏర్పాట్లు, సత్వర,సుదర్శనం కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాబూ అగ్రహారం కోనేరు వద్ద తలనీలాలు సమర్పించుకొనుటకు దేవసా ్థనం అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సెక్యూరిటి ఏర్పాటు చేశారు.



జనం లేక వెల వెల బోతున్న దుకాణాలు

## ఆగని ఇసుక అక్రమ రవాణా



పెళ్లకూరు జూలై 19 ప్రభాతవార్త :

మండలంలోని స్వర్ణముఖి నది వద్ద గల అనేక క్వారీల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ అవసరాలకు ఇసుకను ఉచితంగా ఇవ్వడంతో ఇదే అదునుగా అక్రమార్కులు రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా కంపెనీలకు ఇసుకను తరలిస్తున్నారు. మండలంలోని కప్పగుంట కండ్రిగ వద్ద గల స్వర్ణముఖి నది నుండి శనివారం నాడు ఇసుకను అక్రమంగా కంపెనీలకు తరలిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. అక్కడ ఉన్న దారికి అడ్డంగా ముళ్ళ కంపను వేసి నిరసన తెలిపారు. దీనిపై వారు మాట్లాడుతూ దిరస మాల కప్పగుంట కండ్రిగ గ్రామాల రైతులమైన మేము ఈ స్వర్ణముఖి నదిలో బోరు పాయింట్లు వేసుకుని వాటి ద్వారా వచ్చే నీటితో పంట పొలాలను సాగు చేసుకుంటున్నామని ఇప్పుడు ఈ విధంగా ఇసుకను అక్రమంగా తరలించడం ద్వారా సాగునీటికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి అన్నారు ఈ అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు ఎండిపోయి చాలా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడవచ్చు అన్నారు దీనిపై గత ప్రభుత్వం లోనే రైతులు అందరము కలిసి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నామని ఇప్పుడు ఈ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుకను అక్రమంగా కంపెనీలకు తరలిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి ఈ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని ఈ ప్రభుత్వాన్ని అధికారులను వేడుకుంటున్నామన్నారు.

## పింగర్ ప్రింట్స్ పడటం లేదు:ఐరీష్ పనిచేయడం లేదు.

సిఎంకు వినతి పత్రం అందించిన ఎంఎల్ఏ,తొట్టంబేడు నాయకులు

తొట్టంబేడు.జులై 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పెన్షన్లకు సంబంధించి పలు సమస్యలు చోటు చేసుకున్నాయని శాసనసభ్యుడు బొజ్జల వెంటకసధీర్‌రెడ్డి, తొట్టంబేడు నాయకుడు రావిళ్ళమునిరాజానాయుడులు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం అందించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వికలాంగులకు ఫింగర్ ప్రింట్స్ పడక పెన్షన్లు అందుకోలేక పోతున్నారని, అలాగే ఐరీస్‌లు పని చేయక కొందరు తల్లడిల్లుతున్నారని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తూ శాసనసభ్యుడుసుధీర్‌రెడ్డి రాతమూలకంగా ఫిర్యాదు చేసారు. ముఖ్యంగా తొట్టంబేడు మండలంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. 20రోజులుగా సుపరిపాలలో తొలి అడుగు కార్యక్రమాలకు హాజరైనపుడు ప్రతి గ్రామంలో ఈ సమస్య ఎదురౌతుందన్నారు.ఈ సమస్యపై ముఖ్యమంత్రిని అభ్యర్థిస్తూ టెక్నికల్ సమస్యను పరిష్కరించుటకు అభ్యర్థించారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మాట్లాడుతూ అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్‌ను ఫేస్ ఐడి ద్వారా న్యాయం చేయమని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఏతో పాటు తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు,క్లస్టర్ ఇన్‌చార్జిలు రమేష్, మాజీ జడ్‌పిటిసి వెంకటాచలం యూనిట్ ఇన్‌చార్జి కమల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కర్నాటక హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి,జులై 19 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి కర్నాటక,తమిళనాడుల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతున్నారు.ఈ నేపధ్యంలో శనివారం కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్రడి హెద్దర్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకొనుటకు రాగా వారికి దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంను ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేద పండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎఇఓ మోహన్, పిఆర్ఓ రవి దర్శనం ఏర్పాటు పర్యవేక్షించారు.

## అధికారుల ప్రగతే తప్ప: గ్రామాల్లోని సమస్యలపై చర్చ లేదాయె!

గ్రామాల్లో మంచినీటి సమస్య: సక్రమంగా రాని బస్సులు

తొట్టంబేడు,జులై 19 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలో రెండు నెలలకొకమారు నిర్వహించే మండల సమావేశంలో సర్పంచ్‌లు కానీ, ఎంపిటిసిలు కానీ సమస్యలకు సంబంధించి ప్రశ్నించే దిక్కులేదు.పలు గ్రామాల్లో మంచినీటి సమస్య. సక్రమంగా సరఫరా రాని విద్యుత్ సమస్య. గ్రామీణ ప్రాంతాలకు సక్రమంగా నడవని బస్సులతో జనం తల్లడిల్లుతున్నారు. అయితే మండల సమావేశంలో అధికారుల ఉబ్బుసుపోక ప్రసంగాలు తప్ప జనం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చే లేదు.సమావేశంలో ఎంపిపి భర్త ఉన్నం వాసుదేవనాయుడు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో చొరవ చూపాలన్నారు.మండలంలోని చేమూరు,పొయ్య గ్రామంలో చక్కటి రోడ్డు వేసామని వాసుదేవనాయుడు వివరించారు. మండలంలో వ్యవసాయం ఎత్తుభారంగా మారిందన్నారు.చెంబేడు కాలువ నుంచి వెళ్ళు పంట కాలువలు కోతకుగురౌతున్నారని ఇరిగేషన్ శాఖ స్పందించాలని రైతులను ఆదుకోవాలని వాసుదేవనాయుడు కోరారు. ఉపాధి హామీ పథకంలో 6760 మందికి ఉపాధి కల్పించామన్నారు.2019 కుటుంబాలకు పని కల్పించామన్నారు. మామిడి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తల్లడిల్లుతున్నారన్నారు. మండలంలో సన్న,చిన్న కారు రైతులు మల్లె,రోజా చెట్టు కూడా నాటుకొవచ్చునన్నారు. రాబోవు రోజుల్లో ఉపాధి హామీ పథకంలో వచ్చేనెల నుంచి ఫేస్‌స్కానింగ్ రీడింగ్‌తో పని చేస్తారని ఫోటోలు క్యాప్చర్ చేస్తారని అలాగే వెలుగుకు సంబంధించి అధికారి నరసింహులు మట్లాడుతూఈ ఏడాది రుణ మంజూరుకు సర్వే ప్రకారం నిర్వహిస్తామన్నారు.

*ప్రమాదాల పక్కన పాఠశాలలా?*

తొట్టంబేడు మండలంలోని ఓ గ్యాస్ కంపెనీ పక్కన ప్రవేటు పాఠశాల ఉందన్నారు. విద్యాశాఖా ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు.ఈ పాఠశాలలో ఏడవ తరగతి వరకు అనుమతి ఉన్న పాఠశాలలో పదవ తరగతి వరకు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు.కాసరం పిహెచ్‌సిలో 100ప్రెగ్నేసి కేసులుంటే 20 కేసులు 18 సంవత్సరాలోపు వయస్సు కల్గినవి ఉన్నాయన్నారు. పశుసంవర్ధక శాఖ సారధ్యంలో పశువు లకు గోరైలుకు వాక్సిన్ వేస్తున్నామన్నారు. మండలంలోని హైవే పక్కన ఉన్న గ్రామాల విద్యార్థులను బస్సు డ్రైవర్లు హైవే మీదకు వస్తే ఎక్కించుకుంటామని చెప్పటం శోచనీయం అని సభ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ సురేంద్రనాథ్ ఆర్ఐ,వీఆర్ఓలు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు దూరంగా ఉండాలంటే . . .

తొట్టంబేడు,జులై 19 ప్రభాతవార్త



యువత ప్రమాదాలకు దూరంగా ఉండాలంటే డ్రైవింగ్‌పై చక్కటి అవగాహన కల్గి ఉండాలని టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం నంది సర్కిల్ వద్ద విస్తృతంగా తనిఖీలు చేసారు. నేడు అతి వేగం వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్లలో మాట్లాడటం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని కాబట్టి వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడే పరిస్థితి నుంచి బయట ప డాలన్నారు.ఇక యువకులు ఫైనాన్సులో బండ్లు ఇస్తున్నారని కొనుగోలు చేస్తారని లైసెన్సులేకుండా వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరిగితే ఎలాంటి పథకాలు వర్తించవని సిఐ యువకులకు చైతన్య పరచారు.ప్రతి వాహనం డ్రైవింగ్ చేసే వారు వాహనాలకు సంబంధించిన రికార్డులను దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆటోల డ్రైవర్లు ఒక్కరికి కూడా సరైనలైసెన్సులేదని ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని నాగార్జున్‌రెడ్డి సూచించారు.

## గుర్తుతెలియని వాహనం తీసుకొని వ్యక్తి మృతి

కుప్పం, జులై 19 ప్రభాతవార్త

కుప్పం పలమనేరు జాతీయ రహదారిలో శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు ఈ సంఘటన సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి రామకుప్పం చెందిన రాజారెడ్డి గత కొంతకాలం నుండి శాంతిపురంలో నెట్ సెంటర్ ఫోటో స్టూడియో పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు ప్రతిరోజు రాత్రి ద్విచక్ర వాహనంలో రామకుప్పం కు వెళ్లేవాడు అదే తరహాలో శనివారం కూడా తన పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో రామకుప్పం కు బయలుదేరాడు మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు రాళ్ళబుదుగురు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి ప్రజల సంక్షేమం సాధ్యం



**కల్లూరు, జులై 19, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర ప్రగతి ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఎల్లంకి వారి పల్లి పంచాయతీ పరిధిలో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరించారు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. చల్లా రామచంద్ర రెడ్డికి గ్రామస్తులు టిడిపి నాయకులు కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు లెక్కలు ధనంజయ నాయుడు, ఎంపీటీసీ మునికృష్ణమనాయుడు, టిడిపి నాయకులు దేవేంద్ర, గోపి నాయుడు, మురళి నాయుడు, శంకర, సాగర్, జయచంద్ర నాయుడు, నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోతి దాడిలో బాలికకు గాయాలు

శ్రీకాళహస్తిరూరల్,జులై 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలో కోతి దాడి చేసి ఓ బాలికను గాయపరచిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం అందిన సమాచారం మేరకు ఉడమల పాడు గ్రామంలో నిహిత అనే బాలికపై కోతి దాడి చేసినట్లు సమాచారం. గ్రామానికి చెందిదిన సురేంద్రబాబు, నందినిల కుమార్తె నిహిత ఇంటి ఆవరణలో అడుకుంటుండగా ఆకస్మాత్తుగా కోతి దూకి కొరికినట్లు సమాచారం అందింది.ఆ బాలికను వెటనే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ గ్రామంలో తరచూ కోతులు దాడి చేసి మనుషుల్ని గాయపరుస్తున్నాయి.

## నేడు అభయ సాయి ట్రస్ట్ తరపున 500 మంది భక్తులకు సాయి దర్శనం

పూతలపట్టు, జులై 19, ప్రభాతవార్త

ఎల్‌బిఐ గ్రూప్స్ అధినేత లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో అభయ సాయి ట్రస్ట్ కింద సుమారు 500 మంది భక్తులను షిరిడి సాయి బాబా దర్శనం ఉచితంగా రవాణా ఖర్చులు గాని లేకుండా భోజన వసతితో కూడిన సదుపాయాలు కల్పిస్తూ బాబా దర్శనం చేయించడానికి లోకేష్ రెడ్డి చొరవ తీసుకున్నారు. అంతేకాదు వాళ్ళ తండ్రి రామ్మూర్తి రెడ్డి పేద విద్యార్థులకు పుస్తకాలు వితరణ చేయడం, స్కూల్ బిల్డింగులు కట్టించడం వాటర్ ప్లాంట్‌లు నిర్మించడం కమ్యూనిటీ హాలును నిర్మించి ప్రజలకు విద్యార్థులకు పూతలపట్టు నియోజకవర్గంలో ఎనలేని సేవలు చేస్తూ కీర్తి ప్రతిష్టలు ఘటించడం చాలా హర్షనీయమని ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అస్తవ్యస్తంగా పరిపాలను ప్రతిరూపం వైసీపీ పాలన : టీడీపీ



**విజయపురం, జులై 19 ప్రభాతవార్త:** అస్తవ్యస్త పాలనకు ప్రతి రూపం వైసీపీ పాలన అని మండల టీడీపీ అధ్యక్షుడు పేర్కొన్నారు. శనివారం మండలంలోనిఇ మహారాజపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి రోజా గాలి భానుప్రకాష్ గాలిలో గెలిచారని ఆరోపించారు, కానీ ఆయన గత అసెంబ్లీలో ఎన్నికల్లో కనివిని ఎరుగని రీతిలో 45 వేలకు పై చిలుకు ఓట్లతో గెలిచి ప్రజల పూర్తి మద్దతు పొందారని తెలిపారు. మాజీ మంత్రి గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మొదలు ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ వరకు వ్యక్తిగత విమర్శలు చేసింది గుర్తు లేదా అంటూ.... ప్రశ్నించారు. అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌పై ఆరోపణలు చేసినప్పుడు మీరు ఎక్కడికి వెళ్లారు...అంటూ ప్రశ్నించారు. సిమెంటు రోడ్డు, తారు రోడ్డు మరమ్మతు అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఆరోపణలు చేయడం మాజీ మంత్రికి అర్హత లేదని పదే పదే కంటతడిపెట్టి యాక్షన్ చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. దేయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్(కోసలనగరం), బాబునాయుడు(అగరం రామకృష్ణ), టీడీపీ నాయకులు శివలింగం, కపిల్, సాముమేలు, శ్రీనివాసులు, దశరథరాజు పాల్గొన్నారు.

## తూకివాకం రైతులను ఆదుకోండి...



**రేణిగుంట జులై 19 ప్రభాత వార్త** రేణిగుంట మండలం తూకివాకం రైతులు తమ భూములను ప్రభుత్వ అభివృద్ధికి ఇచ్చారని వారికి సముచితమైన న్యాయం చేయాలంటూ తూకివాకం మాజీ సర్పంచ్ టిడిపి యూనిట్ ఇన్చార్జి భాస్కర్ యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. గతంలో రైతులు అండర్ డ్రైనేజ్ వాటర్ ప్లాంట్ కోసం, 150 అడుగుల బైపాస్ రోడ్డు నిర్మాణానికి, సూరప్ప కసం రోడ్డు కొరకు రైతులు వందల ఎకరాలు ప్రభుత్వానికి అతి తక్కువ నష్టపరిహారానికి ఇచ్చారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సూరప్ప కసంవద్ద భూమిని అప్పటి ఎమ్మెల్యే ఫ్లాట్లు చేసుకొని అమ్ముకున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కి వినతిపత్రం సమర్పించి రైతులకు కనీసం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సీఎంను చూసేందుకు వెళ్లి తీవ్రంగా గాయపడ్డ అభిమాని



***రేణిగుంట జులై 19 ప్రభాతవార్త*** తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై తనకున్న అభిమానాన్ని చాటుకోవడం కోసం చంద్రబాబు నాయుడు వీరాభిమాని వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడిన సంఘటన తిరుపతి విమానాశ్రయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో శనివారం చోటుచేసుకుంది. చంద్రబాబు నాయుడు ను కలవడం కోసం వడమాలపేటకు చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు రేణిగుంట విమానాశ్రయానికి వచ్చారు. జెడ్ ప్లస్ సెక్యూరిటీ లో ఉన్న చంద్రబాబు నాయుడుకు జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. ఆయన చంద్రబాబు వద్దకు చేరుకోవాలని ప్రయత్నం చేశాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమానం దిగి ప్రజల వద్ద నుండి అర్జీలు తీసుకుంటుండగా చంద్రబాబును కలవడానికి వేగంగా వస్తున్న అతను పొరపాటున కాలువపై ఉన్న బండలపై అడుగులు వేశాడు. ఈ క్రమంలో బండ పగిలి కాలు కాలువలో పడింది. కాలు విరిగి బలమైన గాయం అయింది. వెంటనే ఆయనను దగ్గర్లోని ఒక కార్పొరేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## దయనీయ స్థితిలో ఎల్ ఈ ప్రవేశాలు

తిరుపతి విద్య జులై 19 ప్రభాత వార్త:

పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులలో లేటరల్ ఎంటీ (ఎల్ ఈ)తో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు అభ్యర్థులు మొగ్గు చూపడం లేదు. దీంతో జిల్లాలోని ఐదు ప్రభుత్వ,ఒక టీటీడీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో భారీ స్థాయిలో సీట్లు మిగిలిపోయాయి.తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా ఎల్ ఈ ప్రవేశాలకు శనివారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేశారు.దీంతో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎల్ ఈ అడ్మిషన్లు కాస్త మెరుగా కన్పించినా మిగిలిన కళాశాలలో పరిస్థితి సింగిల్ డిజిట్లకే పరిమితమయ్యాయి. సత్యవేడు,పుత్తూరు, చంద్రగిరి,గూడూరు కళాశాలలో జీరో అడ్మిషన్లు జరిగినట్లు సమాచారం.ఒక్కో బ్రాంచికి సంబంధించి గరిష్టంగా 66 సీట్లు ఉంటాయి,ఇందులో ఆరు సీట్లు ఇంటర్ వృత్తి విద్య చదివిన అభ్యర్థులకు,మరో ఆరు సీట్లు ఐటీఐ అభ్యర్థులకు కేటాయిస్తారు.

## ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛంద్రా స్వర్ణాంధ్ర కార్యాక్రమం.

తిరుపతి విద్య జులై 19 ప్రభాత వార్త:



స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛంద్రా స్వర్ణాంధ్ర కార్యాక్రమంలో భాగంగా శనివారం ప్రిన్సి పల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల ఆవర ణలో వ్యర్థాలను తొలగించారు.అనంతరం స్వచ్ఛాంధ్ర పైర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సి పల్ మల్లికార్జున రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో విద్యార్థులచే ర్యాలీ

కేవీబీ పురం, జులై 19 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే శనివారం ఉదయం మండల విద్యాశాఖ అధికారి లక్ష్మిపతి, రవికుమా ర్‌లు, ఎంపీడీవో మాలతి, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు విద్యార్థి బృందంచే భారీ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కేవీబీ పురం ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ రహిత సమాజం మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఉదయం 10 గంటలకు స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వచ్ఛతసేవ, ప్లాస్టిక్ రహిత సమాజం మీద ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, మండల విద్యాశాఖ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయ సిబ్బంది అందరూ కలసి మానవహారం నిర్వహించారు. అనంతరం స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులచే పాఠశాల పరిసరాలను గ్రామంలోని మురికి పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మిపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్, స్కౌట్ ఇన్‌చార్జి మునస్వామి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవా టికెట్ల ధరలపై అభ్యంతరాలుంటే తెలపండి

తిరుచానూరు, జులై 19, ప్రభాతవార్త :

శ్రీ పరాసరేశ్వర స్వామి ఆలయంలో పెరిగిన సేవ టికెట్ల ధరలపై అభ్యంతరాలు వుంటే తెలియజేయాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి మునిశేఖర్ భక్తులను కోరారు. తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరులో ప్రసిద్ధిగాంచిన శ్రీ పరాసరేశ్వర స్వామి విశిష్ట ఆలయం దేవాదాయ శాఖ నిర్వహణలో వున్న విషయము విధితమే. ఈ ఆలయంలో వివిధ సేవలకు పెరిగిన టికెట్ ధరలను ప్రజలకు భక్తులకు వివరిస్తూ వారి సూచనలు, ఫిర్యాదులను దేవాదాయ శాఖ ఉన్నత అధికారులకు తెలియజేస్తూ అనుమతులు తీసుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఈవో పాత్రికలతో మాట్లాడుతూ శ్రీ పరాసరేశ్వర స్వామి సేవ టికెట్లు ధరలను వివరిస్తూ లక్ష బిల్వార్చన 500రూ, కళ్యాణోత్సవం 1000రూ, శీఘ్ర దర్శనం 100రూ, లక్ష కుంకుమార్చన 500రూ, రుద్రాభిషేకం 200రూ, నోములు 20 రూపాయలుగా వివరించారు. అనంతరం పెరిగిన సేవా టికెట్లు ధరలపై స్థానికులకు గాని, స్వామి వారి భక్తులకు గాని, ఎటువంటి అభ్యంతరాలు వున్నా జులై 30వ తారీకులోపు అర్జీ ద్వారా ఆలయంలోని కార్యనిర్వహణ అధికారి అయిన తనకు తెలియజేయాలని కోరారు. భక్తులు ఏదైనా అభ్యంతరాలు, మార్పులను కోరితే దేవాదాయ శాఖకు తెలియజేస్తామని అన్నారు.

## విద్యార్థులకు రాజకీయ అవగాహన

శ్రీకాళహస్తి,జులై 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని నారాయణ స్కూల్ నందు శనివారం నిర్వాహకులు విద్యార్థులకు శాసనసభ, భారత ఎన్నికలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఓ వైపు విద్యార్థులకు పాఠాలతో పాటు నాయకత్వపు లక్షణాలు పెంపొందించే విధంగా 5 నఉంచి 9 తరగతి చదువుతున్న విద్యార్థులకు అగ్నిహౌస్, నాగహౌస్, పృద్ధిహౌస్,త్రిషూల్ హౌస్ అనే నాలుగు విభాగాల్లో హెడ్‌బాయ్, హెడ్ గర్ల్ అని తరగతి నాయకులను విద్యార్థులు ఉపాధ్యాయులు స్వతంత్రంగా ప్రత్యేక ఎన్నికల వలె ఓటింగ్,రూపంలో తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయటం ఎన్నుకోడటం ప్రక్రియను నిర్వహించారు. అందులో విజేతగా నిలిచిన తరగతి నాయకులను మరియు పాఠశాల నాయకునికి ప్రత్యేకంగా పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య రీజినల్‌మేనేజర్ శ్రీనివాసులు,ప్రత్యేకంగా క్యాబినేట్ ఇన్‌స్టిట్యూట్ అను అభినందన సభ ఏర్పాటు చేసి గెలుపొందిన వారికి అభినందించారు. అలాగే శాసనసభలో ప్రమాణ స్వీకారం కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఆర్ఐ కిరణ్; కోఆర్డినేటర్ గాయత్రి, సాఫ్ట స్కిల్స్ ఆర్ఎస్‌టి సాయికుమార్, డీన్ కేదర్,పిఇటి దేశయ్య,ఎస్ఎస్‌టి హర్షవీణ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## భక్తిసాగరంలో నగరసంకీర్తన

గోవిందనామాలతో ప్రతిధ్వనింపు



తిరుపతి రవాణ, జులై 19 ప్రభాతవార్త

శనివారం వేకువజామున ఆధ్యాత్మికనగరం తిరుపతి గోవిందనామస్మరణతో ప్రతి ధ్వనించింది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందింపజేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండదమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మునినాథరెడ్డి, కస్తూపద్మనాభమ్, శాంభోలుహరి,విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, మేకల గంగయ్య, సురేంద్రరాజు, పద్మావతి, జయమ్మ, కళ . విగ్రహాల కల్యాణి, మురళీరెడ్డి, వందమంది కళాకారులు తిరునామం ధరించి తప్పెటతాళాలతో భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## చేతిపంపు బాగు చేయండి సారూ...

పాకాల, జులై 19, ప్రభాతవార్త



పాకాల పంచాయతీ తాగునీటి పథకాలు, బోర్ల మరమ్మ తులు కోసం ఏటా రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు రాస్తున్నారు. క్షేత్రస్థాయిలో తగినట్లుగా పనులు కనిపించడం లేదు. నిత్యం జనసంచారం ఉండే పూరి పేట కూడలిలో కొన్నేళ్ల ముందు చేతిపంపును ఏర్పాటు చేశారు. పట్టణ నీటి కుళాయిలు నుంచి నీటి సరఫరా లేని సమయంలో వేసవిలో ఈ బోరు ఉపయోగకరంగా ఉంది. హ్యాండీల్ దెబ్బతిని బోరు భావిలోపల పైపులు జారి పడిపోయిన కారణంతో మంచినీటి బోరు పనిచేయక ఏడాది నుంచి నీరు రావడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్‌అధికారులకు అన్నిసార్లు చెప్పినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికయినా సరిచేస్తే పూరి పేట ప్రజలు, బాట సారులు తమ దాహార్తి తీర్చుకుంటారు.

## బాబు షూరిటీ మోసం గ్యారంటీ - ఇన్‌చార్జి నూకతోటి రాజేష్

**సత్యవేడు, జులై 19 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి జనగన్న పార్టీ ఓడిపోలేదు కానీ ఈవీఎంలు ఓడగొట్టాయని తిరుపతి జిల్లా సత్యవేడు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ ఆరోపించారు. శనివారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నూకతోటి రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికప్పుడే ఎన్నికలు జరిగితే వైసీపీ అధికారంలోకి వస్తుందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో కొన్ని అమలు జరిగిన మిగిలినవి ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు. వైసీపీ నాయకులను కేసులో ఇరికించి ఎక్కడకక్కడే అరెస్టు చేస్తూ పోవడం ఆటవిక రాజ్యానికి నిదర్శనమన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో వారానికి రెండు రోజులు తాను అందుబాటులో ఉంటానని, సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా నాయకుల ముఖ్య కార్యక్రమాలను నియోజకవర్గ కేంద్రం సత్యవేడులో నిర్వహించాల్సింది పోయి ఇతర మండలాల్లో నిర్వహించడంపై సురుటుపల్లి ఆలయ మాజీ ఛైర్మన్ మునిశేఖర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. తమసమస్యలను చెప్పుకునేందుకు ముఖ్య నాయకులకు ఫోన్ చేసినా కలుసుకోవాలన్న కుదరడం లేదని మదరంజేరి పంచాయతీ తొండుకులి వైసీపీ నాయకులు మునస్వామి, కదిరివేడు దళితవాడకు చెందిన స్టిఫాన్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధికి సంబంధించిన ఓ వర్గం నాయకులు గైర్హాజరు కావడంపై గుసగుసలు వినిపించాయి. తదనంతరం ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ నాయకులతో కలసి బాబు షూరిటీ మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సురుటుపల్లి ఆలయ మాజీ ఛైర్మన్ బాలాజీరెడ్డి, బెల్ట్ రమేష్, మస్తానమ్మ, గోవిందస్వామి, గురుప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రేక్షకులను కంటతడి పెట్టించిన "ద్రౌపథీ మానసంరక్షణ"

ఆకట్టుకున్న అనసూయ మహాభారత హరికథ



**రామచంద్రాపురం, జులై 19 ప్రభాతవార్త:** సి.రామా పురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా శనివారం ద్రౌపథీ మానసంరక్షణ హరికథ ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. సి.రామాపురంలో భాగవతారిణి అనసూయ మహాభారత హరికథను వినిపిస్తూ భక్తులను మంత్రముగ్దులను గావిస్తున్నారు. ద్రౌపథీ అమ్మవారిని దుశ్శాసనుడు నిండు సభలోనికి లాక్కుని రావడం, అమ్మవారిని దుర్భాషలాడటం వంటి ఘట్టాలను కన్నులకు కట్టినట్లు వర్ణించారు. దుశ్శాసనుడు, ద్రౌపథీ అమ్మవారి చీరలను లాడగం, అమ్మవారు శ్రీకృష్ణపరమాత్ముడిని వేడుకోవడంతో కౌరవులు స్వామివారు రక్షించడం వంటి ఘట్టాలు ప్రేక్షకులను కంటతడి పెట్టించారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



***పుత్తూరు రూరల్, జులై 19 ప్రభాతవార్త:*** రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు మున్సిపల్ ఇంజనీ రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కూడా దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలపై సమ్మెబాట పట్టారు. జీవో 36 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు, గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు సంబంధించిన జీవోలు వెంటనే ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలు పెంచాలని, రిటైర్ట్‌మెంట్ చేసిన అనారోగ్యంతో బాధపడు తున్న మరణించిన కార్మికులకు స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పించాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు విజయ్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, రామలింగం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంలో సిబ్బంది సక్రమంగా రావడం లేదు : ఎంపీపీ

పుత్తూరు రూరల్, జులై 19 ప్రభాతవార్త:



సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఎంపీపీ మునివేలు పేర్కొన్నారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సక్రమంగా హాజరు కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో వాణి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామ సచివాలయ సిబ్బందికి కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలు జరుగుతున్నాయని ఈ నేపథ్యంలో కొంత లోపం ఉందని వాస్తవమేనా అని ప్రక్రియ పూర్తయిన వెంటనే గ్రామ సచివాలయానికి తరచూ తనిఖీలు చేసి సిబ్బంది హాజరయ్యేవిధంగా చూస్తామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంజరుగుతుందని అసిస్టెంట్ మేనేజర్ మంగమ్మ తెలిపారు.వివిధ శాఖలకు సంబంధించి తమ ప్రగతి నివేదికను తెలియజేశారు.అధికారులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో స్వచ్ఛాంధ్ర



తిరుపతి విద్య జులై 19 ప్రభాత వార్త:

ఎస్వీయూలో ప్రతి మూడవ శనివారం నిర్వహించే "స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాన్ని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రారంభించారు.ఈ సంద ర్భంగా వర్సిటీలోని సైన్స్,ఆర్ట్స్,కామర్స్ అండ్ మేనేజ్మెం ట్, ఇంజనీరింగ్ కళాశాలల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి,ఉద్యోగి కళాశాల పరిసరాలతో పాటు తాము నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఆరోగ్య సంరక్షణకు పరిశుభ్రత ప్రధాన కారణమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు ఆచార్య చంద్రాయుడు, ఎగ్జామినేషన్స్ డీన్ సురేంద్ర బాబు, విద్యార్థులు,ఉద్యోగులు, అధ్యాపకులు పాల్గొన్నారు .

## ఒక మహిళపై వ్యక్తిగత దూషణలు చేయడం ఎమ్మెల్యేకి సరికాదు

- వైసీపీ నాయకుల ధ్వజం



***విజయపురం, జులై 19 ప్రభాతవార్త:*** మాజీ మంత్రి, సినీ నటిగా ప్రజలకు ఎంతో దగ్గరగా ఉన్న మహిళ నాయకురాలు రోజాపై స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఇష్టానుసారంగా వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని మండల వైసీపీ నాయకులు మండి పడ్డారు. మండల కేంద్రంలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఒక ప్రజాప్రతినిధిగా గౌరవంగా ప్రవర్తించాల్సిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సభ్య సమాజం తలదించుకునేలా మహిళ అని కూడా చూడకుండా మా నాయకురాలైన రోజాపై నోరు జారడం సరికాదన్నారు. మంత్రిగా ఎల్లవేళలా సేవలందించారన్నారు. అటువంటి మహిళపై వ్యక్తిగత విమర్శలు చేసి మానసికంగా వేధించడం ఎమ్మెల్యేకి తగదన్నారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడిన శాసన సభ్యులు మహిళలను గౌరవించాల్సింది పోయి అధికారం చేతిలో ఉందని ఇష్టానుసారంగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర వైసీపీ పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, రైతు విభాగ కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, రాష్ట్ర వైసీపీ ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్, నాయ కులు నారప్పరాజు, రమేష్‌రెడ్డి, నాగరాజు, బాలకృష్ణనాయుడు, పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే పార్టీలో గుర్తింపు ఉంటుంది

**- కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి**



కోట, జులై 19 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ పేదల పార్టీ అని, పార్టీ కోసం ఎవరైతే కష్టపడతారో అటువంటి వారికి గుర్తింపుతో పాటు పదవులు దక్కుతాయని కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక షాదీమంజిల్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బూత్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలగాటి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కార్యకర్త సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ అమలుపరిచిన సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు. ఈ సందర్భంగా కోట మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరుమలశెట్టి కోటేశ్వర రావును నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, సిద్ధవరం సొసైటీ ఛైర్మన్ పాదర్తి కోటేశ్వరరెడ్డి, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ చాపల శ్రీనివాసులు, కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, ఎంపిటిసి దారా సురేష్, మహిళా నాయకులు సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్లపై పారిశుధ్య కార్మికుల నిరసన

సూళ్లూరుపేట, జులై 19 ప్రభాతవార్త: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు గత కొన్నిరోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తమ న్యాయపరమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను సానుభూతితో పరిష్కరించకుండా జాప్యం చేయడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో రియాజ్, సాంబ శివయ్య, చంద్రశేఖర్, పద్మనాభయ్య, అక్బర్‌బాషా, భాస్కర్, ఫయాజ్, ఖాన్, వెంకటరత్నం, రామయ్య, కరీం, మురళీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాని మాతృమూర్తికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



వెంకటగిరి, జులై 19 ప్రభాతవార్త : చంద్రగిరి నియోజక వర్గ శాసనసభ్యులు పులివర్తి నాని మాతృమూర్తి పులివర్తి లక్ష్మి భారతమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు వెంకటగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు.

## అక్రమ అరెస్టులకు వైసిపి నాయకులు భయపడరు: ఎంపీ



వెంకటగిరి, జులై 19 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పై కూటమి ప్రభుత్వం వారు పెడుతున్న అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత నెలకొన్న పరిస్థితుల నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తక్కువ కాలంలోనే రాజకీయంగా కోలుకొని బలమైన ప్రజాగొంతుకగా నిలిచిందని అన్నారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేస్తూ ప్రభుత్వం ముచ్చెమటలు పట్టించే స్థాయికి చేరిందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌తో పాటు టీడీపీ నాయకులకు దిక్కుతోచని స్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇలాంటి కుట్రపూర్తిగా కేసులకు భయపడే తత్వం తమ నాయకులది కాదని అన్నారు.

## చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు

వెంకటగిరి, జులై 19 ప్రభాతవార్త : వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోని మట్టిని కొందరు లేఅవుట్ వేసిన వారు తవ్వుకొని ఉపయోగిస్తున్న జల వనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ బాబు రెడ్డికి వెంటనే అరికట్టాలని 14వ వార్డు కౌన్సిలర్, ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు ఆరి శంకరయ్య ఫిర్యాదు చేశారు. ఎన్ని చెరువుల్లో మట్టి తోలుతున్నారు, ప్రభుత్వానికి ఎంత డబ్బులు చెల్లించారు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగారు. చెరువుల్లో తోలుతున్న అక్రమం మట్టిని నిలిపివేయాలని కోరారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జూనియర్ సివిల్ జడ్జి



వెంకటగిరి, జులై 19 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రముగా ఉంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జ్ విష్ణువర్మ తెలిపారు. వెంకటగిరి కోర్టు ఆవరణలో సిబ్బందితో కలిసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణను జడ్జి సిబ్బంది కలిసి చిమ్మి శుభ్రపరిచారు. ఆవరణలో ఉన్న చెత్త చెదరాన్ని పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు రావాలని సూచించారు. మొక్కలను కూడా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపిడిఓ

కోట, జులై 19 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ దిలీప్‌కుమార్ కోటలోని పలు దుకాణదారులకు ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోయి నేల సారాన్ని తగ్గిస్తాయన్నారు. ఇది పంటల ఉత్పత్తిని ప్రభావితం చేస్తుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వలన హానికరమైన వాయువులు విడుదల అవుతాయన్నారు. ఇది వాతావరణాన్ని కలుషితం చేస్తాయని, ప్లాస్టిక్ వ్యర్థాలు ఆహారంలో కలిస్తే విషపూరితమైన రసాయనాలు మనుషులకు చేరి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రజలను భాగస్వాములుగా చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు.

## వాకాడులో భారీ వర్షం

వాకాడు, జులై 19 ప్రభాతవార్త : వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో శనివారం అకాల భారీ వర్షం పడగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎండలతో భగ్గు మంటున్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయి భారీ వర్షం పడింది. దీంతో రైతులకు మామిడి తోటల్లో, కూడా తీవ్ర నష్టాన్ని గురిచేసాయి. ఈ అకాల వర్షంతో ఇటుక ఇటుక బట్టీలు నిర్వహణతో పాటు చిరు వ్యాపారం సైతం తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఊహించిన విధంగా రెండు గంటల పాటు పడిన అకాల వర్షానికి పౌర జీవనం అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల విద్యుత్ అంతరాయం కలిగింది. ఈ వర్షాలు రాకతో వరి వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పొలాల్లో అవుట్లు పేలి గాయాల పాలైన మూగ జీవాలు



పెళ్లకూరు జులై 19 ప్రభాతవార్త : మండలం లోని ఎగువ కానూరు గ్రామ పొలాల్లో పశువులు మేతకు వెళ్లిన పశువులు పొలాల్లో అవుట్లు పాతి ఉంచడం వలన మూగ జీవాలైన బర్రెలు మేత మేయుచుండగా ఔట్లు పేలి బర్రెలు గాయాలు పాలైన దుర్ఘటన శనివారం నాడు చోటు చేసుకుంది. ఈ సంఘటనలో మూగజీవాలు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదంలో ఉన్నవని నిడిగంటి రమణయ్య అనే బర్రెల రైతు తీవ్రంగా ఆవేదన చెందుతున్నాడు. ఇటువంటి దురదృష్టకరమైన సంఘటన వలన కేవలం మూగ జీవలుకే కాక మనుషులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు

## ఏఎంసి చేర్మేన్‌ను సన్మానించిన జనసేన



నాయుడుపేట, జులై 19 ప్రభాతవార్త : వ్యవసాయ మార్కెట్ కమిటి నూతన చేర్మేన్‌గా నియమితులైన సూళ్ళూరుపేట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌ను పలువురు జనసేన నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం నెల్లూరు నగర జనసేన పార్టీ అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పలువురు జిల్లానాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, కోవూరు, గూడూరు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు తీగల చ ద్రశేఖర్,నల్లిశెట్టి శ్రీధర్, చప్పిడి శ్రీనివాసులురెడ్డి,మోహన్,అజయ్‌బాబు తదితరులు ఉన్నారు.

## ఉపాధి హామీ పనులు తనిఖీ

కోట, జులై 19 ప్రభాతవార్త : మండలం ఉత్తమనెల్లూరు, పుచ్చలపల్లి పంచాయతీలోని చీకల్లదిబ్బ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఓ దిలీప్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని చెరువుల్లో ఉపాధి హామీ పథకం కింద ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారు, మస్టర్‌లో ఎంతమందిని చూపించారని రికార్డులు పరిశీలించారు. పనులు నిబంధనల మేరకు చేయాలని ఎంపిడిఓ సూచించారు. అనంతరం వారి చేత ప్రతిజ్ఞ చేయించారు.

## రెండు పాఠశాలల విలీనం రద్దు

కోట, జులై 19 ప్రభాతవార్త : కోటలోని నార్త్ గిరిజన కాలనీ పాఠశాలను రద్దు చేసి అక్కడి విద్యార్థులను సమీపంలోని జరుగుమల్లి గ్రామంలోని పాఠశాలకు తరలించారు. ఆ క్రమంలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఆందోళన చేశారు. ఇదే క్రమంలో పుచ్చలపల్లి పంచాయతీ పరిధిలోని దెయ్యాలదిబ్బ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను అల్లంపాడు గ్రామంలోని పాఠశాలకు తరలించారు. అక్కడ కూడా ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ మేరకు ఆ రెండు గ్రామాల పాఠశాలల విలీనాన్ని రద్దు చేస్తున్నట్లు తమకు ఆదేశాలు అందాయని ఎంఇఓ మస్తానయ్య తెలిపారు.

## మేఘం ఉరిమింది...ఉక్కపోత తొలగింది

కోట, జులై 19 ప్రభాతవార్త: గత రెండురోజులుగా రాత్రి వేళల్లో వర్షం కురిసింది. జులై 3వ వారం వచ్చినా గత పదిరోజులుగా వేసవి తరహాలో పగటి ఉష్ణోగ్రతలు ఉన్నాయి. వేడి, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తాజాగా కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. అర్ధరాత్రి వేళ కోట, వాకాడు తీరప్రాంతంలో ఉరుములతో ఈదురు గాలులు వీచాయి. దీంతో కొంతమేరకు ప్రజలకు ఉపశమనం కలిగింది.

## అభివృద్ధికి నిధులు అడిగిన ఎమ్మెల్యే



వెంకటగిరి, జులై 19 ప్రభాతవార్త: జిల్లాలోని వెనుగుబడిన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడుని ఎమ్మెల్యే రామకృష్ణ కోరారు. సీఎం రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే మర్యాదపూర్వ కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సీఎంకు వినతిపత్రం అందజేశారు. సోమశిల సన్నముఖి కాలువ, ఆల్తూరుపాడు రిజర్వాయర్, రోడ్లు తదితర పనులకు నిధులు కావాలని కోరారు.

## సీఎం చంద్రబాబు కష్టంలో భాగమవుతా : డాలర్



తిరుపతి కలెక్టరేట్, జులై 19 ప్రభాతవార్త : రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజా సంక్షేమం కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు రాత్రింబవుళ్ళు కష్టపడుతున్నారని ఆయన కష్టంలో తాను భాగమవుతానని తుడా ఛైర్మన్, టీటీడీ బోర్డు మెంబర్ డాలర్ దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడును డాలర్ దివాకర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు నాయుడు లాంటి మహోన్నత వ్యక్తి తిరిగి ఏపీకి సీఎం కావడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి పనిచేయడం తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

# చంద్రబాబుకు అడుగడుగునా అపూర్వ స్వాగతం... వీడ్కోలు



రేణిగుంట, జులై 19 ప్రభాతవార్త : తిరుపతి రేణిగుంట లలో జరిగే పలు అభివృద్ధి నిర్మాణాల ప్రారంభోత్సవాలు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక విమానంలో రేణిగుంట చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. రేణిగుంట విమానాశ్రయం నుండి రేణిగుంట, తూకివాకం మార్గాల్లో తిరుపతి చేరుకున్న ఆయనపై వరుడు చిరుజల్లులు చిలకరిస్తుండగా అభిమానులు ముఖ్యంగా మహిళలు పుష్ప వర్షం కురిపించారు. అభిమానుల అభిమానం అయినను పులకరింపజేసింది. విమానాశ్రయంలో ఆయనకు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, డీఐజీ షిమోషి బాచ్ పాయ్, జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, నగిరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ , సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్, వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, సర్వేపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్ హరి ప్రసాద్, ఏపీ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్స్ ఛైర్మన్ సుగుణమ్మ, తుడ ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్,బి జె పి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస, టిడిపి రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి రెడ్డి వారి గురువారెడ్డి, టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తిరుపతి పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, తుకివాకం మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్,శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఆఫ్రోజ్, ఏర్పేడు టిడిపి నాయకులు పున్నారావు,శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ రవి మనోహర్ ఆచారి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు తదితర అధికారులు ప్రజాప్రతినిధులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరమైన రోడ్డు మార్గంలో వెళుతుండగా రేణిగుంట ఎన్టీఆర్ విగ్రహం వద్ద రేణిగుంట మండల పార్టీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, తెలుగుదేశం పార్టీ మాజీ ఎస్సీ సెల్ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం, రేణిగుంట పట్టణ టిడిపి యూత్ అధ్యక్షుడు కిరణ్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దేవళ్ళ రమణ పలువురు టిడిపి నాయకులు అభిమానులు పెద్ద సంఖ్యలో మహిళలు చంద్రబాబుకు స్వాగతం పలికి ఆయనపై పుష్ప వర్షం కురిపించారు.కాన్వాయ్ వాహనంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమాలు ముగించుకుని రాత్రి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలు దేరి వెళ్లారు. స్వాగతం పలికిన నేతలు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు వీడ్కోలు పలికారు.

## దొంగ కేసులకు భయపడేది లేదు : పెద్దిరెడ్డి



సదుం, జులై 19 ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ వచ్చినప్పటి నుంచి వైసిపీ నాయకులపై పెడుతున్న కేసులన్నీ దొంగ కేసులేనని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి అన్నారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై పెట్టిన మద్యం కేసు కూడా ఇలాంటి కేసేనని ఇటువంటి వాటికి ఎవరు భయపడేది లేదని చెప్పారు. శనివారం సదుంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో కూడా ఇటువంటి తప్పుడు కేసులు పెట్టి మిథున్ రెడ్డిని జైలుకు పంపారని అవన్నీ తప్పుడు కేసులని రుజువు అయినాయని చెప్పారు. అదే విధంగా మదనపల్లెలోని ఫైల్స్ దహనం కేసు, పులిచెర్ల అటవీ ఆక్రమణ కేసు, తిరుపతిలోని మఠం భూముల ఆక్రమణ కేసు, ఇవన్నీ కూడా తమపై కక్ష గట్టి కేసు నమోదు చేశారని చెప్పారు. ఒక కేసులో కూడా అధికారుల వద్ద సరైన సాక్ష్యాలు లేవని ఉన్నట్లు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఇలా బెదిరింపు కేసులు పెడితే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. కార్యకర్తలు నాయకులు ఎవరు భయపడవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటస్వామి మండల వైసీపీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, సర్పంచులు హనుమంత్ రెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీ మల్లికార్జున, వైసీపీ నాయకులు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకన్న సేవలో హైకోర్టు సీజే



వడమాలపేట, జులై 19 ప్రభాతవార్త: రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.శ్రీనివాసులు రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య సేవలోశ్రీకాంత్ షిండే పూజలు



శ్రీకాళహస్తి,జులై 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మహారాష్ట్ర డెప్యూటి ముఖ్యమంత్రి కుమారుడు, మహారాష్ట్ర పార్లమెంటు సభ్యుడుశ్రీకాంత్ షిండే కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి వారి సహచరులు స్వాగతం పలికారు. ఇక ఆలయం తరఫున దక్షిణ గోపురం వద్ద ఆలయ ఎఇఓ మోహన్, పిఆర్ఓ రవిలు వేదపండితులతో మేళతాళాలతో స్వాగతం పలికారు. ఎంఎల్ఏతో పాటు మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు ఉన్నారు.

# గూడూరు డివిజన్

## ఫ్లోరింగ్ టైల్స్ వితరణ



గూడూరు, జులై 19 ప్రభాతవార్త : పట్టణంలోని తూర్పు వీధిలో ఏర్పాటై ఉన్న సరస్వతి శిశు మందిరం అదనపు గదులకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రోటేరియన్స్ సేగు శ్రీనివాసులు, బండి ధనుంజయరెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డిల దాతృత్వంతో 25 వేల రూపాయలు విలువచేసే ఫ్లోరింగ్ టైల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ ద్వారా గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.నూతనంగా రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన విజయ భాస్కర్‌రెడ్డిని, రాఘవరెడ్డిని, ప్రముఖ ఆడిటర్ కంటి రామ్మోహనరావు, పాఠశాల అధ్యక్షులు మురళిరెడ్డిలు ఘనంగా సన్మానించారు. రొటేరియన్స్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, వాసు గౌడ్,సనత్ కుమార్‌రెడ్డి, నాసిన నాగులు, చోడవరం గిరిబాబు, బొమ్మిడి శ్రీనివాసులు, డివి సుబ్రహ్మణ్యం, మూలి హరినాథ్‌రెడ్డి, లక్ష్మినారాయణ, కె.శ్రీనివాసరావు, పి.హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నివారణకు కృషి చేద్దాం : శీలం కిరణ్



గూడూరు, జులై 19 ప్రభాతవార్త: ప్లాస్టిక్ కవర్లను నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ సిబ్బంది పొదుపు సంఘాల మహిళలు ప్రజలకు అవగాహన కల్పించాలని టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద పురపాలక సంఘ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సమావేశంలో బిల్లు చెంచురామయ్య ఆరికట్ల మస్తాన్ నాయుడు, రహీం, ఇజ్రాయిల్, మాకాని వెంకటేశ్వర్లు, ఇంచార్జ్ కమిషనర్ మురళి, వెంకటయ్య, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## గంధమహోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ



గూడూరు, జులై 19 ప్రభాతవార్త : పట్టణంలో వెలసి ఉన్నటువంటి హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి గంధమహోత్సవ కరపత్రాలను దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ చేతుల మీదుగా దర్గా ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మొహరం మాసం తర్వాత వచ్చేటువంటి సఫర్ నెల చంద్రోదయం చూసిన వెంటనే హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి దర్గా నందు నిషాన్ జెండా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 26వ తేదీ శనివారం సాయంత్రం ఏడు గంటలకు నిషాన్ కార్యక్రమం జరుగుతుందని ఆగస్టు 13వ తేదీ బుధవారం గంధమహోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ రియాజ్ అహ్మద్, మత గురువులు మగ్దూమ్ అలీషా, గౌస్ మస్థాన్ ఖాదరి, కమిటీ ప్రతినిధులు షానవాజ్, సంధాని భాష, గోల్డెన్ గౌస్, యస్దాని భాష, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమానికి క్రీడా కిట్లు వితరణ



చిల్లకూరు, జులై 19 ప్రభాతవార్త: జిల్లా అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా రాయ్ చెస్ అకాడమీ అధ్వర్యంలో చిల్లకూరులోని డేనియల్ అనాధాశ్రమల్లో పిల్లలకు చెస్ కిట్లు, ఏబిసి చెస్ పుస్తకాలు, స్నాక్స్ పంపిణి చేసారు. ఈ సందర్భంగా రాయ్ చెస్ అకాడమీ జట్టు సభ్యులు షరీఫా, వసీం, రవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



గూడూరు, జులై 19 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రేణిగుంట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసిన శాలువ పూలమాలతో సన్మానించారు. గూడూరు శాసనసభలో పాశం సునీల్ కుమార్ అనంతరం జిల్లాలో ఉన్న శాసనసభ్యులు అందరితో సమీక్ష సమావేశం నిర్వహించి పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

## గూడూరులో బాబు ష్యూరిటి మోసం గ్యారంటీ



గూడూరు, జులై 19 ప్రభాతవార్త: పట్టణంలోని సనత్ నగర్‌లో ఎమ్మెల్సీ మేరగ మురళి నివాసం వద్ద నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏర్పడి 14 నెలలు కావస్తున్న ఒక లక్ష 98కోట్లు అప్పులు తేవడం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని అన్నారు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ కార్యక్రమాలు పార్టీలకతీతంగా ఇవ్వడం జరిగిందని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అమలవుతుందని తెలిపారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక కార్యకర్తల మాటే జగనన్న పాట రాబోయే రోజుల్లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మే రుగా మురళి, నాయకులు చేవూరు మోహన్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, కోడూరు వీరారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, వాయుగండ్ల నాగరాజు, నాశన నాగులు, మగ్గంబాయ్ పాదర్తి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓజిలిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారింటీ



ఓజిలి, జులై 19 ప్రభాతవార్త: ఓజిలిలో వైయస్సార్సీపీ ఓజిలి మండల అధ్యక్షుడు పాదర్తి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్సీపి సూళ్లూరుపేట నియోజకవర్గం కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిధిగా పాల్గొని, బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గద్దం అరుణ, వైసీపీ కో ఆప్షన్ సభ్యులు ఖాదర్ బాషా, దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పాకనాటి ప్రవీణ, వెంకట సుబ్బారాజు, కొండూరు దామోదరరాజు, లెక్కల ప్రసాద్ నాయుడు, రఘురామరాజు, దిలీప్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాపూజీ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు



సూళ్లూరుపేట, జులై 19 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సూళ్లూరుపేటలోని బాపూజీ కాలనీలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. బాపూజీ కాలనీలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఆకుతోట రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఎజి కిషోర్, దంతాల రవి, సిహెచ్ రమణయ్య, ఆలీ, కొండలరావు, శ్యామ్, కె.శ్రీధర్, ఆలీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర



నాయుడుపేట, జులై 19 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలో మున్సిపాల్టి మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో అధికారులు శనివారం స్వర్ణఆంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపాల్టి మేనేజర్ ఉరుకుందమ్మ మాట్లడుతూ తిరుపతిజిల్లా కలెక్టర్ ఆదేశాల మెరకు ప్రతినెలలో మూవడ శనివారం స్వర్ణఆంధ్ర- స్వచ్ఛఆ ంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై ప్రజలకు వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపాల్టి, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


**MUNICIPAL ADMINISTRATION DEPARTMENT**

**VENKATAGIRI MUNICIPALITY**

**'e' PROCUREMENT NOTICE**

Roc.No.521/2025/E1 Dated: 19-07-2025

Grant : General Fund-4 works, Estimate Contract Value Rs. 14.37 lakhs.

**IFB. No.01/VMC/MPLTY/2025-26 to 04/VMC/MPLTY/2025-26**

Nature of works : **Desilting o Drains, Drilling New Bore Wells and New Submersible Motors**

**1. Bid Downloading Satart Time & Date :10.30AM on 19-07-2025**

**2. Bid Downloading End Time & Date : 4.30AM on 25-072025**

**3. Bid Submission Closing Time & Date : 5.30AM on 25-07-2025**

Further details can be seen at 'e' Procurement Market place @ http:// www.eprocurement.gov.in, Mobile No.9908287733

**Commissioner, Venkatagiri Municipality**